కవితా కౌముది

# నిర్యాణం

తుర్లపాటి రామానుజరావు

నరాల దారాలకు
దోమల పూసలు
గుచ్చుతున్న చలి సూదిని
పిడికిళ్ళతో పట్టుకుని
ప్రేవుల కంటుకున్న ఆకలిని
తడిసిన రొట్టె ముక్కతో
తుడిచి
నీడ నివ్వని
రాతి గుండెల రాత్రి
సొమ్మసిల్లిన
పసి తల్లి
పేవ్మెంటుపై
ముడుచుకు పడుకున్నది,
పాల కోసం
ఏడ్చి ఏడ్చినిద్రపోతున్న
చిన్న పిల్ల
తల్లి పేగుకి
అంటుకుని ఉన్నట్లు
కలగంటున్నది,
నగరం నడి వీధిలో
షాపుల షట్టర్లు
వెలుగు జిలుగుల సెగలు తగిలి
రాని నిద్రను ప్రార్థిస్తూ
కళ్ళకు తాళాలు వేసుకున్నాయి ,
అంతలో..

గొంతులో పార్టీ మత్తు పొంగి
తల నుండీ నరాలు నిండి
ప్రేయసి ముద్దు మాటల
దారితప్పి
దూసుకెళ్ళిన
వాహనం
మెలకువ లేని
ఆకలి చావుకు
ఏక పక్ష తీర్పు నిచ్చింది,
తెల్లారిన జీవితాలకు
ఎర్ర టోపీలు, నల్ల కళ్ళద్దాల
జవాబు అడగని ప్రశ్నలు
భాష్యం చెబుతాయి,
రక్తం ఎండిన
మట్టి పూసుకుని
పగలు చీకటి కళ్ళద్దాలతో
మునిసిపాలిటి బండి ఎక్కుతుంది
ఎక్కడో ఒక గొప్ప వ్యక్తి
మహాభినిష్క్రమణ
త్రాసు బరువెక్కి
బిచ్చగత్తె చావు వార్త
పేపర్ల మూలలు వెతుకుతుంది ,
రాత్రి దాచిన
మీడియా చూడని వార్తలకోసం
ఉదయాన్నే
సూర్యుడు నిద్రలేస్తాడు !!

★★★

# మంచుఖండం

ఉమా నూతక్కి

నువ్విచ్చే రాత్రుళ్ళని
తన గుండెల్లో ఉగ్గబడుతూ
నిన్నొక పగలుగా లోకానికి పరిచయం చేస్తూ
నీ సుఖాలకి తానూ హత్తుకోలు అవుతూ
తన శబ్దాలన్నిటినీ శీతలం చేసుకుంటూ
తన నిశ్శబ్దం పొదుల్లో
నీ మాటలని పెంచుకుంటూ
ఒక నల్లని పావురంగా తన రెక్కల కిందన
నీ పసి పిట్టలని కాపు కాస్తుంది!

నీ గుండెని తడపాల్సిన వర్షం మొత్తాన్ని
తన కళ్లల్లోనే నిలుపుచేస్తూ
నీలం పువ్వులా తాను మారిపోయి
నిన్నొక తెల్లకాగితంలా
లోకానికి చూపెడుతుంది !

ఎలాంటి రోజులైతేనేం
తానొక పాలపిట్టలా నీ చుట్టూనే ఉంటుంది
లోలోపల నిండుకున్న నవ్వులన్నిటినీ
ఒక్క సారిగా తిరిగి తెచ్చుకోగలననుకునే
ఒక పిచ్చి నమ్మకంతో
నువ్వేం చేస్తున్నావు...

ఇంట్లో జీవంలేని పనిముట్ల మధ్యలో
తనని ఒక జీవమున్న పనిముట్టుగా చూస్తూ
బయటేమో నిన్ను నువ్వు ఎక్కువగా తూసుకుంటూ
తనని తేలికచేస్తూ
కాలాన్ని నీలాంటి వాళ్ళ మధ్య ఈడవటం తప్ప!

మరి... పనిముట్లూ మొరాయిస్తాయన్న
నిజం మరచిపోతే ఎలా !?

ఇదంతా
ఇక చాలు అనుకున్న రోజున
తనకు తాను మొరాయించి
ఒక మంచుఖండంగా ఘనీభవిస్తే
ఆ పొరల క్రిందన
కొన్ని శతాబ్దాల మౌనంగా కప్పబడిపోతావు
ఇక నిన్ను పట్టించుకునేవారెవరూ లేక
గర్భస్థం చేసుకువటానికి ఎవరూ ముందుకు రాక!

***



## గుర్తులహారం

అల్లూరి గౌరీలక్ష్మి

ఒకోసారి ఎవరైనా గభాల్న అడుగుతుంటారు
ఇంతన్నావ్! అంతన్నావ్ ! ఏం సాధించావని ?
నేనేం సంపాదించుకున్నానో ఎన్నడూ ఎవరికీ చెప్పను
ఒకానొక రహస్య ప్రదేశంలో ఆ 'పేరు'ను దాచుకున్నా

అదేంటో తెలుసా ! అమూల్య స్నేహితుల మాల
ఆ 'హారం ' నిండా నా మిత్ర రత్నాల్ని పొదిగాను
జీవయాత్రలో ఎక్కడెక్కడో గెలుచుకున్న వారిని
నెయ్యపు నగిషీలు పెట్టి తీర్చి దిద్దుకున్నాను

ఆ నేస్తాల గుర్తులన్నీ దండలా గుచ్చుకున్నా
ఎవరికి చూపించినా నదరు తగులుతుందని
గుండె గది లోపలి లాకర్ పెట్టెలో పదిలంగా పెట్టాను
అప్పుడప్పుడూ చూసి మురిసిపోతుంటాను

ఆ రత్నాలు కొన్ని ఆటపాటల ప్రాయపువి
మరి కొన్ని నూత్నయువ చదువుల చెలిమినాటివి
ఇంకొన్ని సుదీర్ఘపు సర్కారీ కొలువులప్పటివి
ఇంకా కొన్ని కొత్తగా మెరుస్తున్న నిన్నమొన్నటివి

ఎప్పటికప్పుడు నా ఉనికిని గుర్తించి మెచ్చింది వీళ్ళే కదా మరి !
నా వీపు నిమిరిందీ, నన్నెదిగించిందీ వీళ్ళు కాక ఇంకెవరు ?
పై లోకానికి నే తరలిపోయినా తప్పక గుర్తుంచుకునేది వీళ్ళు మాత్రమే !
నా గురించి నా తర్వాత చల్లని వేళ రెండు మాటలు చెప్పేదీ వీళ్ళే !

★★★★

## ఓ మల్లీ..

చామర్తి సుబ్బలక్ష్మి

పగలంతా ..పసిరి మొగ్గవు ..
సంధ్యాకాలం అరవిరిసిన యవ్వన దశలో ..
అడుగేస్తావు .

నిశిరాత్రి ..
పరిమళాలు వెదజల్లే పరిపూర్ణతనొంది
యవ్వనపు రేకులు విప్పి
రసికతను పరాకాష్టకు చేర్చే
రసమాధురివి.

ఉషోదయానికి ..
తలకు ..తలగడకు ....మధ్య నలిగి
వడలి వసించి రెక్కలు ముక్కలై
పెంట పై సమాధి పొందుతావు .

ఓ మల్లీ !!!
నీ జీవితకాలం ఒక పూట .
అయినా పుడతావు ..ప్రతీ యేటా.

★★★



# రసరేఖలు

## శ్రీధర్ బచ్చోటి

ఎందుకో యీ నదము ప్రవహించుచుండె
ఎచటికో యేగి యేమి సాధించు కొరకొ
అలసటెరుగక సాగుటే యాశయమ్మొ
కడలిలో యైక్యమగుటయె గమ్యమేమొ

సాగిపోవుచునింత యాశ్రయమునిచ్చి
జలచరమ్ములనెన్నియో సాకుచుండు
తనకొరుంగునదేమన్న తలపు లేక
తిరిగి యేమిచ్చునన్న సందియము లేక

ఉరకలు పరుగులెత్తు తానొక్క సారి
నెమ్మదిగ నొకపరి పయనించుచుండు
ఊహకందక పతనమౌనొక్క సారి
తిరిగి ముందుకు సాగునేమెరుగనెట్లు

మనిషి జీవితమిదియని మదికి తోచు
కాని జీవితమ్మునకంత్యకాలముండు
నదమునకు మొదలు నడుమ తుదయు కూడ
నిత్యమై శాశ్వతమ్మన నిలచి యుండు

ప్రాణరహితమ్ము కాదు జీవనము నదము
చలనరహితమ్ము కాదు సంచలనయుతము
క్షణము నిలువక సాగెడు గమనమిద్ది
నేర్వదగునీ నిరంతర నీరయాత్ర



చిత్రం: కె.రామ్మోహన్

COMMENTS